సాక్షి
నారాయణపేట
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



ఏసీబీ వలలో డీపీఓ

జోగుళాంబ గద్వాల డీపీఓతో పాటు పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడ్డారు.

వివరాలు 8లో ▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు

మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /17.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. ఉదయం, రాత్రివేళ చల్లని గాలులు వీస్తాయి.

వేతనాలు అందక వేతలు

- ఆర్థిక ఇబ్బందుల్లో జిల్లా ఆస్పత్రి సిబ్బంది
- రెండు శాఖల మధ్య నలుగుతున్న వైనం
- ఆర్నెళ్లుగా అందని వేతనాలు
- నల్ల బ్యాడ్జీలతో నిరసన



జిల్లా జనరల్ ఆస్పత్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఐసీయూ సిబ్బంది

నారాయణపేట: జిల్లా ప్రభుత్వ దవాఖానాలో విధులు నిర్వర్తిస్తున్న ఐసీయూ సిబ్బందికి ఆర్నెళ్లుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో నానా అవస్థలు పడుతున్నారు. టీవీవీపీ కాంట్రాక్టర్ పరిధిలో ఉన్నప్పుడు గతేడాది జూలై వరకు వేతనాలు వారి అకౌంట్‌లో జమ అయ్యాయి. ఆ తర్వాత రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా వేతనాలు రాకపోవడంతో ఆందోళన బాట పట్టారు. ఇటు తెలంగాణ వైద్య విధాన పరిషత్, అటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పెండింగ్ వేతనాల చెల్లింపు బాధ్యత మాది కాదంటే మాది కాదంటూ జాప్యం చేస్తున్నాయి. దీంతో ఆ రెండు శాఖల మధ్య వైద్య ఉద్యోగులు నలిగిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలను చెల్లించాలని వేడుకుంటున్నారు. జిల్లా ప్రభుత్వ దవాఖానాలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ సిబ్బంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 20 మంది పని చేస్తున్నారు. వారిలో జిల్లా ప్రభుత్వ దవాఖానాలోని ఐసీయూ విభాగంలో రేడియా గ్రాఫర్ 1, ల్యాబ్‌టెక్నిషన్ 1 , ఎఫ్ఎన్ఓ/ఎంఎన్ఓ 8 , సెక్యూరిటీ గార్డ్స్ 3, వెంటిలేటర్ టెక్నీషియన్ 1, స్టాఫ్ నర్సులు ఆరుగురు పని చేస్తున్నారు. అందులో రేడియోగ్రాఫర్, ల్యాబ్ టెక్నీషయన్, స్టాఫ్ నర్సులకు రూ.22,750, మిగతా వారికి రూ.13,500 వేతనాలు చెల్లించాల్సి ఉంది.

మెడికల్ కాలేజీ ప్రారంభంతో..

గత అక్టోబర్ నెలాఖరులో నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి సమీపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. అప్పటి నుంచి జిల్లా ప్రభుత్వ దవాఖానా అటు వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ), ఇటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎం ఈ) పరిధిలో నిర్వహణ కొనసాగుతుంది. టీవీవీపీ పరిధిలో ఉన్న జిల్లా ప్రభుత్వ దవాఖానను



టీచింగ్ ఆసుపత్రిగా మారుస్తూ డీఎంఈ పరిధిలోకి తీసుకురావడం, ఆసుపత్రిలో పని చేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి మెడికల్ కాలేజీ ప్రారంభంకాక ముందు రెండు నెలల బకాయి ఉండగా, మెడికల్ కాలేజీ ప్రారంభమయ్యాక నాలుగు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది.

నల్లబ్యాడ్జీలతో నిరసన

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలంటూ జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం ఐసీయూ సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టాల్సి ఉంటుందని, ఇకపైన ఏం జరిగిన సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని సిబ్బంది హెచ్చరించారు.

రెండు శాఖల మధ్య..

తమ వేతన బకాయిల విషయమై కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు టీవీవీపీ అధికారులను అడిగితే ఆసుపత్రి డీఎంఈ పరిధిలోకి మారినందున వేతనాలు ఆ శాఖనే చెల్లిస్తుందని చెబుతున్నారని తెలిపారు. ఇటు డీఎంఈ అధికారులను అడిగితే ఆసుపత్రి తమ శాఖ పరిధిలోకి మారినట్టు తమకు ఇంకా అధికారిక ఉత్తర్వులు అందలేదని పేర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యను వైద్య విధాన పరిషత్ కమిషనర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లామని, ఇంత వరకు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతనాలు అందించాలి



నెల నెలా వేతనాలు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. పాత బకాయిలు మొత్తం చెల్లించడంతో పాటు నెల నెలకు వేతనాలు చెల్లిస్తే బాగుంటుంది.

– నరేందర్, ఎంఎన్ఓ

ఆర్నెళ్లుగా ఆర్థిక ఇబ్బందులు



నాకు నెలకు రూ.22,750 వేతనం అందాల్సి ఉంది. ముందు ప్రభుత్వ జిల్లా దవాఖానా వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉండేది. ఆ శాఖ ద్వారానే రెండు నెలలకు ఒకసారి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి బడ్జెట్ విడుదలయ్యేది. మెడికల్ కళాశాల ప్రారంభం తర్వాత మమ్మల్ని ఆ శాఖలో విలీనం చేశామని చెబుతున్నారు. తమకు వేతనాలు రావడం లేదు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాం.

– మనోహర్, రేడియోగ్రాఫర్

డీఎంఈకి సరెండర్ చేశాం

ఐసీయూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న 20 మంది సిబ్బంది వివరాలను డీఎంఈకి సరెండర్ చేశాం. వారికి సంబంధించి వేతనాలను కోరుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేయగానే వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

– మల్లికార్జున్, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: గత మూడేళ్లుగా ఎఫ్ఎల్ఎన్‌పైన పనిచేస్తున్నప్పటికీ విద్యార్థుల విద్యా ప్రమాణాలు తరగతి స్థాయికి అనుగుణంగా లేకపోవడం ఏంటని.. ఇకనైనా పెంపొందించేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం అమలుపరుస్తున్న ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా విద్యార్థుల ప్రగతి నమోదు వివరాలపై శుక్రవారం విద్యాశాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మిడ్లైన్ పరీక్షకు సంబంధించిన ఎఫ్ఎల్ఐపి వివరాలు రెండు రోజుల్లోగా ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. 40 రోజుల కార్యక్రమంలో భాగంగా వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేకంగా జరుగుతున్న బోధనను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు మానిటరింగ్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అమలుపరుస్తున్న భాషా పఠన కార్యక్రమంలో భాగంగా ఒక నిమిషంలో విద్యార్థులు చదవగలిగే పదాల వివరాలను టైమర్ సహాయంతో నమోదు చేస్తూ విద్యార్థులకు ధారాళంగా చదవడం అలవాటు చేయాలన్నారు. ఇక మీదట ప్రతి వారం సమీక్ష సమావేశాలు ఉంటాయని విద్యార్థుల ప్రగతి పైన మానిటరింగ్ అధికారుల పర్యవేక్షణ పైన సమీక్షను నిర్వహిస్తానని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, ఏ ఎమ్ ఓ విద్యాసాగర్, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, జిసిడివో నర్మద సీఎస్ఎఫ్ ప్రతినిధులు షాలెట్, జై, హర్ష పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారుల డైరీని కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి , విజయవంతం చేసినందుకుగాను డీఏఓ, వ్యవసాయ శాఖ అధికారులను అభినందిస్తున్నమన్నారు. శాఖ పరంగా ఏ విధమైన సహకారాన్ని అయిన అందించడానికి అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవె న్యూ అడిషనల్ కలెక్టర్ బేన్‌షాలం, డీఏఓ జాన్‌సుధాకర్, ఏడీఏలు నగేష్, హైమవతి, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు సహకరించాలి

నారాయణపేట: రోడ్డు వెడల్పు పనులలో గృహ యజమానులు సహకరించాలని.. వారికి నష్టం కలగకుండా చూడాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ మీటింగ్ హాల్‌లో కోస్గి రోడ్డు వెడల్పు పనులపై తహసీల్దార్, మున్సిపల్ అధికారులు, ఇళ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోయే వారితో డిస్ట్రిక్ లెవెల్ నెగోషియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.4200 స్క్వేర్ యాడ్ ప్రకారం రెసిడెన్షియల్ ప్లాట్స్‌కు, రూ.11,600 కమర్షియల్ షాప్‌లకు నష్టపరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు .ఈ సందర్భంగా 188 మందికిగాను, 165 మంది ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం తీసుకొనుటకు సమ్మతి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలం , ఆర్డీవో రామచంద్ర, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, నాగరాజు కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య



నారాయణపేట రూరల్: రంగారెడ్డి జిల్లా కోర్టులో మహిళా జడ్జిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టులో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ సభ్యులు మాట్లాడుతూ.. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఈమేరకు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పటిష్టమైన చట్టం లేకపోవడంతో ఏకంగా జడ్జిపైనే దాడికి పాల్పడ్డాడని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయవాదులు, జడ్జీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, చెన్నారెడ్డి, న్యాయవాదులు సీతారామరావు, లక్ష్మీపతి, బాలప్ప పాల్గొన్నారు.

పెసర క్వింటాల్ రూ.6,550

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం పెసర క్వింటాల్ గరిష్ఠం , కనిష్ఠంగా రూ.6,506 ధర పలికింది. శనగలు గరిష్ఠంగా రూ.6,069, కనిష్ఠంగా రూ.6,033, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,550, కనిష్ఠంగా రూ.4,569, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.7,759, కనిష్ఠంగా రూ.4,602, తెల్ల కందులు గరిష్ఠంగా రూ.7,909, కనిష్ఠంగా రూ.5,555 ధర పలికాయి.

విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ఫోరం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫోరం చైర్‌పర్సన్, టెక్నిక్ మెంబర్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో విద్యుత్ వినియోగదారుల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తక్షణ పరిష్కారం చూపినట్లు తెలిపారు. 50 ఫిర్యాదులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖ అధికారులపై ఉందన్నారు. వేసవిలో వచ్చే సమస్యలను అధిగమించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈ రమేష్, సీజీఎం రామాంజనాయక్, వెంకట్, లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

బీసీ జనాభాను తక్కువ చేసి చూపారు

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్



పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనలో బీసీల 20 లక్షల జనాభాను తక్కువ చేసి చూపారని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. శుక్రవారం ధర్మాపురంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు జనాభాను తక్కువ చేసి చూపించి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక తప్పిదం చేసిందన్నారు. మరోసారి చేపడుతున్న రీ సర్వేలో తప్పులు సరిదిద్దుకొని న్యాయం చేయకపోతే బీసీల ఆగ్రహానికి గురికావా ల్సి వస్తుందని హెచ్చరించారు. పాలమూరు వీరు డు పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తామ ని అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అందెశ్రీ రచించిన తెలంగాణ రాష్ట్ర గీతంలో పండుగ సాయన్న వీరగాధను పొందుపరిచామని అన్నారు. ప్రతిరోజూ ప్రతి పాఠశాలలో ఆయనను స్మరించుకుంటున్నామన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ముదిరాజ్‌లు నేటికీ అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బెక్కెం జనార్దన్ రచించిన పండుగ సాయన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఎన్పీ వెంకటేష్, బెక్కెం జనార్దన్, పెద్ద విజయ్‌కుమార్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్, పండుగ సాయన్న సామాజిక సేవాసంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణముదిరాజ్, మైత్రి యాదయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నారాయణపేట రూరల్: కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప తెలిపారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు 16 ఏళ్లలోపు విద్యార్థులు ఆదార్ కార్డు, టెస్ట్ మెమో తీసుకొని హాజరు కావాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జిల్లా జట్టు ఎంపిక చేసి ఈనెల 20 నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరు ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను శుక్రవారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిన్న చింతకుంట ఎస్ఐగా ఉన్న శేఖర్‌ను నారాయణపేట వీఆర్‌కు, నారాయణపేట వీఆర్‌లో ఉన్న ఎస్ఐ రామ్‌లాల్‌ను సీసీకుంటకు బదిలీ చేశారు.

ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి రోజు క్రీడల్లో పాల్గొనాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్ లో శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం పొందవచ్చని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో సైతం ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు సాధించుకోవచ్చని తెలిపారు. అనంతరం రన్నింగ్, త్రో, జంప్ తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఏర్పాటు చేశారు. ఈనెల 18, 19 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే క్రీడా పోటీలకు నారాయణపేట జిల్లా తరపున వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో రాకేష్, అక్తర్ పాషా, గణేష్, నరసింహులు, నరేష్, మహేష్, లత తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు చేయరా..?

కేఎల్ఐ ప్రాజెక్టులో పాడైన రెండు మోటార్లు

- ఎల్లూరు పంప్‌హౌజ్‌లో నాలుగున్నరేళ్లుగా గాలికొదిలేసిన వైనం
- మూడింటితోనే కొనసాగుతున్న ఎత్తిపోతలు
- వివిధ రకాల సాకులతో కాలయాపన
- ఏటా వేసవిలో తప్పని సాగు, తాగునీటి కష్టాలు

ఉమ్మడి పాలమూరువాసుల సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలనే ఉద్దేశంతో.. రూ.వేల కోట్లు వెచ్చించి.. సంవత్సరాల తరబడి శ్రమించి ప్రాజెక్టు నిర్మించారు.. కానీ, రెండు మోటార్లకు చిన్నపాటి మరమ్మతు చేసేందుకు అంతకు మించి కాలయాపన చేస్తున్నారు. ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఉంది.. ఎవరు అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విషయం పక్కనపెడితే.. ఉమ్మడి జిల్లా ప్రజలు మాత్రం ప్రతిఏటా ఎండాకాలంలో ఇటు సాగునీటికి, అటు తాగునీటికి గోస పడక తప్పడం లేదు.

– కొల్లాపూర్

మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో పంపు మోటార్ల మరమ్మతు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో పడుతూనే ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు వనపర్తి జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీరు, ఉమ్మడి పాలమూరు–రంగారెడ్డి జిల్లాలకు తాగునీరు కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అందుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని ఎల్లూరు లిఫ్టు నుంచి కృష్ణానది నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లు, చెరువులు నింపుతున్నారు. అయితే ప్రాజెక్టులోని మొదటి పంపుహౌజ్ (ఎల్లూరు లిఫ్టు)లో రెండు మోటార్లు పాడై ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇందుకు ఇటు ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత కంపెనీ ప్రతినిధులు వేర్వేరు కారణాలు చెబుతున్నారు.

ఎత్తిపోతలకు ఇక్కట్లు..

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న మూడు మోటార్లలో రెండింటితోనే నీటి ఎత్తిపోతలు నిర్వహిస్తుండగా.. మరొకటి స్పేర్‌లో ఉంది. రెండు మోటార్లతోనే నీటి ఎత్తిపోతలు చేపడుతుండటంతో వరదల సమయంలో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు నింపేందుకు ఆలస్యమవుతోంది. కృష్ణానది వరద ప్రవాహ సమయంలో ఎల్లూరు పంప్‌హౌజ్‌లో నాలుగు మోటార్లు నడిపించి రోజుకు 3,200 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలి. ఈ నీటితో రిజర్వాయర్లతో పాటు, చెరువులు కూడా నింపుకోవాలి. కానీ, ఎల్లూరు లిఫ్టులో రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తుండడంతో ఆశించిన స్థాయిలో ఎత్తిపోతలు జరగడం లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 2,208 చెరువులు నింపేందుకు నెలలు గడిచిపోతోంది.

మరమ్మతులకు ఆటంకం

కేఎల్ఐ ప్రాజెక్టులో మోటార్లు పాడైతే మరమ్మతు చేపట్టడం ఇబ్బందికరంగా మారుతోంది. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ స్కీం కేఎల్ఐ ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉండటంతో రెగ్యులర్‌గా నీటి ఎత్తిపోత జరుగుతుంది. దీంతో మోటార్ల మరమ్మతుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మోటార్లు మరమ్మతు చేయాలంటే నీటి ఎత్తిపోతలు కొంత కాలం పాటు పూర్తిగా నిలిపివేయాల్సి ఉంటుంది. పాలమూరు ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తేనే కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు నిలిపే అవకాశం ఉంది. పాలమూరు ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ప్రారంభమయ్యే వరకు మోటార్లకు మరమ్మతు చేపట్టడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు. అయితే పాత బిల్లులు పెండింగ్‌లో ఉండటం కూడా కొంత కారణమని సంబంధిత కంపెనీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.



ఎల్లూరులోని పంపుహౌజ్

ప్రాజెక్టులోని పంపుల వివరాలు ఇలా..

ఎల్లూరు లిఫ్టులో మొత్తం పంపులు 5	ఒక్కో పంపు ద్వారా రోజూ ఎత్తిపోసే నీరు 800 క్యూసెక్కులు
ఒక్కో పంపు మోటారు కెపాసిటీ 30 మెగావాట్లు	డెలివరీ పైపుల వ్యాసం 3 మీటర్లు
మరమ్మతుకు గురైనవి 2	ప్రస్తుతం పని చేస్తున్నవి 3

ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది..

ఎల్లూరు లిఫ్టులోని ఐదు మోటార్లలో రెండు మోటార్లు పాడై చాలా కాలం అవుతోంది. ఇటీవల మరో పంపు మోటారు కూడా స్వల్ప మరమ్మతుకు గురైంది. అయితే దీనికి ఇక్కడే మరమ్మతు చేయవచ్చు. ప్రస్తుతం రెండు మోటార్లతోనే నీటి ఎత్తిపోతలు సాగుతున్నాయి. అయితే మిషన్ భగీరథ కోసం రెగ్యులర్‌గా నీటి ఎత్తిపోతలు చేపట్టాలి. ఇలా చేయడం వల్ల మోటార్ల మరమ్మతు చేపట్టేందుకు ఆటంకం ఏర్పడుతుంది. ఇప్పటికైతే మరమ్మతు అంశం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

– లోకిలాల్‌నాయక్, పంపుహౌజ్ నిర్వహణ విభాగం డీఈఈ

3, 5 నంబర్ల మోటార్లు

కేఎల్ఐ ప్రాజెక్టులోని ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసి.. ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లు నింపాలి. ఈ రిజర్వాయర్లకు అనుసంధానంగా ఉన్న చెరువులను కూడా రెగ్యులర్‌గా నింపుతూ ఉండాలి. ఇందుకోసం ఎల్లూరు పంప్‌హౌజ్‌లో 5 మోటార్లను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు మోటార్లు పాడయ్యాయి. నాలుగున్నరేళ్ల క్రితం పంప్‌హౌజ్‌లోకి నీరు చేరడంతో మూడో నంబర్ పంప్ మోటార్ దెబ్బతినగా.. ఇప్పటి వరకు ఆ మోటార్ మరమ్మతుకు నోచుకోలేదు. అలాగే రెండేళ్ల క్రితం 5వ నంబర్ పంప్ మోటార్ కూడా దెబ్బతినగా.. దీనిని కూడా అలాగే వదిలేశారు. దీంతో మిగిలిన మూడు మోటార్లతోనే నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు.



ఎల్లూరు పంపుహౌజ్ వద్ద పాడైన మోటార్ భాగాలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మాగనూర్(కృష్ణా): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన కృష్ణా మండలం హిందూపూర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవీద్ వివరాల మేరకు.. బెంగళూరు నుంచి గుల్బర్గ వెళ్తున్న లారీని కృష్ణా మండలం హిందూపూర్ శివారులో ఎలాంటి సూచికలు లేకుండా డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలో గూడెబల్లూర్‌కు చెందిన మహేష్ తన వదిన మహాదేవి (50)తో కలిసి బైక్‌పై స్వగ్రామం నుంచి కృష్ణాకు వస్తూ.. హిందూపూర్ శివారులో ఆగి ఉన్న లారీని వెనక నుంచి వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో వారిద్దరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానికులు రాయచూర్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహాదేవి మృతిచెందింది. మృతురాలి కుమారుడు తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అడ్డాకుల: మండలంలోని కాటవరం స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షాలు (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లికి చెందిన షాలు అడ్డాకులలో ఉంటూ రాళ్లు కొడుతూ జీవనం సాగించేవాడు. ఈ నెల 12న రాత్రి అడ్డాకుల వైపు నుంచి వచ్చిన పాక్లెయిన్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో రవీందర్ (32) అక్కడికక్కడే మృతిచెందగా షాలుకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందాడని ఎస్‌ఐ వివరించారు.

సహకార సంఘాల పదవీకాలం పొడిగింపు



మహబూబ్‌నగర్ (వ్యవసాయం): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గ పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పాలక వర్గాల పదవీ కాలం ముగిసిన తర్వాత పర్సన్ ఇన్‌చార్జిల పాలన కొనసాగించాలని ప్రభుత్వం భావించింది. ఇన్‌చార్జి అధికారుల పాలనలో సహకార సంఘాలు పలు ఆటుపోట్లకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రస్తుత పాలక వర్గాన్నే కొనసాగించి రైతులకు ఎప్పటిలాగే సేవా కార్యక్రమాలు కొనసాగించాలని భావించింది. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్‌తో పాటు పీఏసీఎస్ చైర్మన్‌ల పదవీ కాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ 47 జీఓను శుక్రవారం విడుదల చేసింది. పాలకవర్గ పదవీ కాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం సుందర్శన్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపులకు అన్యాయం

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న



సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో రాష్ట్రంలోని మున్నూరుకాపులకు అన్యాయం జరిగిందని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులను అన్నిరంగాల్లో అణగదొక్కటానికి కుట్ర జరుగుతుందని అన్నారు. గతంలోఎక్కువగా ఉన్న జనాభాను ప్రస్తుతం తక్కువగా చూపి రాష్ట్ర ప్రభుత్వం ఘోరమైన తప్పిదం చేసిందన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 28 లక్షల జనాభా ఉందని, ప్రస్తుతం నిర్వహించిన కులగణన సర్వేలో కేవలం 19 లక్షలు చూపించడం ఏమిటని ప్రశ్నించారు. 15 లక్షల మంది జనాభాను తొలగించడంలో అంతర్యమేమిటని, ఇందులో ఏదో కుట్ర కోణం దాగి ఉందని అనుమానం వ్యక్తంచేశారు. తమ సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని, అందులో భాగంగా మున్నూరు కాపులు ఉన్న ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అలాగే పది లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించి మున్నూరు కాపుల తడాఖా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. మున్నూరు కాపు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెద్ది పెంటయ్య, జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్, నాయకులు స్వామి, కృష్ణారెడ్డి, పురుషోత్తం, బుచ్చయ్య పాల్గొన్నారు.

ఏసీబీ వలలో.. జోగుళాంబ గద్వాల డీపీఓ

- వెంచర్ అనుమతుల కోసం రూ.3 లక్షలు డిమాండ్
- డీపీఓ శ్యాంసుందర్ సూచన మేరకు రూ.2 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన పుల్లూరు పంచాయతీ కార్యదర్శి
- ఇద్దరిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు



గద్వాల: ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శితో సహా జిల్లా అధికారి పట్టుబడ్డారు. ఓ వెంచర్‌కు సంబంధించి రూ. 2లక్షలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ.. ఫోన్ సంభాషణల ఆధారంగా డీపీఓ పాత్ర ఉన్నట్లు తేల్చింది. వారిద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో కలకలం రేపింది. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వివరాల మేరకు.. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో షేక్ అన్సరుల్లా షరీఫ్ సర్వే నంబర్ 435/ఏలోని నాలుగెకరాల్లో ప్లాట్లు చేసి అన్నపూర్ణ గ్రీన్‌ల్యాండ్ వెంచర్‌ను వేశారు. ఈ వెంచర్ మొత్తాన్ని పర్యవేక్షించేందుకు అహ్మద్ ఎజాజ్ అనే వ్యక్తిని మేనేజర్‌గా నియమించుకున్నారు. ఈ క్రమంలో వెంచర్ అనుమతుల కోసం మేనేజర్ మహ్మద్ ఎజాజ్ పంచాయతీ అధికారులకు దరఖాస్తు చేశారు. అయితే వెంచర్ పక్కనే ఉన్న పొలం వ్యక్తి సదరు వెంచర్‌లోకి వెళ్లకుండా దారికి అడ్డంగా గుంత తవ్వి అడ్డు చెప్పారు. ఈ కారణం చూపెడుతూ అనుమతులు ఇవ్వడం కుదరదని డీపీఓ శ్యాంసుందర్, పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్ వెంచర్ మేనేజర్‌కు తెలిపారు. అయితే ఎలాగైనా అనుమతులు ఇవ్వాలని మేనేజర్ కోరగా.. వెంచర్‌కు అనుమతులు ఇవ్వాలంటే డబ్బులు ఖర్చు అవుతాయని.. రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల తర్వాత రూ.2 లక్షలు ఇచ్చేందుకు డీల్ చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం అలంపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్దకు వెంచర్ మేనేజర్ మహ్మద్ ఎజాజ్ రూ. 2 లక్షల నగదు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు ఇచ్చారు. డబ్బులు తీసుకున్న కార్యదర్శి.. డీపీఓ శ్యాంసుందర్‌కు ఫోన్ చేసి డబ్బులు ముట్టాయని చెప్పారు. అప్పటికే అక్కడ ఉన్న ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా డీపీఓ శ్యాంసుందర్‌ను సైతం అరెస్టు చేశారు. వీరిద్దరిని శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు.



ఏసీబీకి చిక్కిన డీపీఓ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

ముగిసిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలు



శేషవాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు.. ఇన్‌సెట్‌లో అలంకరణలో స్వామివారు

- చివరిరోజు ఘనంగా శేషవాహన, దర్బార్ సేవ
- భారీగా తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7న ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు రాత్రి స్వామివారికి వివిధ రకాల సేవలు నిర్వహించారు. సేవలు ముగిసినప్పటికీ మార్చి 12న కొండ దిగువనున్న అలివేలు మంగతాయారు ఉత్సవాలు ప్రారంభమయ్యే వరకు జాతర కొనసాగుతుంది. చివరిరోజు ఉదయం చక్రస్నాన కార్యక్రమం నిర్వహించారు. మొదట మన్యంకొండ ఆలయ నిర్మాణ మూల పురుషుడు అళహరి రామయ్య చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామివారి సుదర్శన పెరుమాళ్లను ఉంచి గర్భాలయం నుంచి తేరు మైదానం సమీపంలో ఉన్న హనుమద్దాసుల పుష్కరిణికి తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహయ్య, నిత్యానందం చక్రస్నానం నిర్వహించి అనంతరం అలివేలు మంగతాయారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తిరిగి గర్భగుడి వద్దకు తీసుకొచ్చారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లు పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. పల్లకీసేవకు భక్తులు అడుగడుగునా పూజలు చేసి నీరాజనాలు పలికారు. అలాగే రాత్రి శేషవాహన, దర్బార్ సేవ జరిగింది. స్వామివారు ముత్యాల అలంకరణలో భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాస రాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముడు

- పథకం ప్రకారమే హత్య
- ఆరుగురు నిందితులు అరెస్ట్
- 48గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం: ఆస్తి కోసం అన్నను తమ్ముడు వేటకొడవళ్లతో హత్య చేయించిన కేసును జిల్లా పోలీస్ శాఖ 48గంటల్లో ఛేదించి ఆరుగురు అరెస్ట్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వడ్డేపల్లి మండలం తనగలకి చెందిన సంధ్యపోగు క్రిష్టన్న(గుర్రం బండి కిష్టన్న)కు నలుగురు సంతానం. అయితే ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల మధ్య వివాదం చోటుచేసుకుంది. సంధ్యపోగు రమేష్ (26) ప్రస్తుతం యాపదిన్నె గ్రామంలో ఉంటూ నివాసం ఉంటున్నాడు. ఈ నెల 12వ తేదీన అలంపూర్ కోర్టులో కేసు విషయమై హాజరై బైక్‌పై రమేష్ తన మామ సుధాకర్‌తో కలిసి స్వగ్రామానికి వస్తున్నారు. ఆస్తి తగాదాలను మనస్సులో పెట్టుకున్న తమ్ముడు సంధ్యపోగు మహేష్, తల్లిదండ్రులు కిష్టన్న, తీమ్ములమ్మ, సోదరుడు గోపితో పాటు స్నేహితులు గట్టు మండలంకు చెందిన బోయ నర్సింహులు, బండమీది తిమ్మప్ప, నాగేంద్రతో కలసి రమేష్‌ను హత్య చేసేందుకు పథక రచన చేశారు. అనుకున్న పథకం ప్రకారం కోర్టు నుంచి బయలు దేరిన వారిని కారులో కొంత మంది అనుసరిస్తు వెంకటాపురం స్టేజీ సమీపంలో కారుతో ఢీకొట్టారు. ఈ క్రమంలో బైక్‌పై నుంచి ఇద్దరు కిందపడిపోయారు. గమనించిన ప్రత్యర్థులు వేట కోడవళ్లతో రమేష్‌ను హత్యచేసి తప్పించుకున్నారు. ఈ ప్రమాదంలో మృతుడి మామ సుధాకర్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణలో భాగంగా నిందితుల కదలికలను సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఓన్యాయవాదిని కలిసేందుకు కారులో వెళ్తున్న క్రమంలో సిబ్బంది వారిని గుర్తించి జల్లాపురం ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్‌చేశారు. కారులో మూడు కత్తులు, నాలుగు మొబైల్‌ఫోన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసు చేధనలో డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు, ఎస్‌ఐలు, సిబ్బంది కృషి చేశారన్నారు. పట్టుబడిన నిందితుల్లో ఆరుగురిని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మృతుడి తల్లి తీమ్ములమ్మ పరారీలో ఉంది. త్వరలో అమెను సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు.



రమేష్ హత్యకు వినియోగించిన వేట కోడవళ్లు

పథకం ఇలా..

మృతుడు రమేష్‌కు తల్లిదండ్రులు, సోదరులకు ఆస్తుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో కోర్టులో కేసులు నడుస్తున్నాయి. మృతుడు వారం రోజుల క్రితం బయటకు వచ్చిన నేపథ్యంలో హత్య చేద్దామని వచ్చారు. ఆరోజు సాధ్యం కాలేదన్నారు. రమేష్‌ను హత్య చేయించేందుకు మహేష్, గోపీలు గట్టుకు చెందిన వ్యక్తులతో రూ.1.50లక్షల విలుగల ఆటోను ఇచ్చేందుకు డీల్ కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం ఈనెల 12న బైక్‌పై వెళ్తున్న వారిని అనుసరించి అయిజ మండలం వెంకటాపురం స్టేజీ సమీపం వద్దకు రాగానే కారుతో ఢీకొట్టి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా తల నరికి హత్యచేసి తప్పించుకున్నారు.

'అక్షయపాత్ర' భేష్

- ప్రశంసించిన కేంద్ర బృందం



నవాబుపేటలో అక్షయపాత్ర మధ్యాహ్న భోజన తయారీ కేంద్రం వద్ద కేంద్ర బృందం సభ్యులు

నవాబుపేట: మండలంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయపాత్ర నిర్వహణ భేష్‌గా ఉందని కేంద్ర బృందం ప్రశంసించింది. శుక్రవారం మండల కేంద్రంలోని అక్షయపాత్ర నిర్వహణ కేంద్రాన్ని ఆ బృందం పరిశీలించింది. ఆహారం తయారుచేస్తున్న విధానం, సరఫరా విభాగాలు, సరుకులు తదితర వాటిని పరిశీలించారు. రోజువారీగా విద్యార్థులకు అందిస్తున్న మెనూను చూసి హర్షం వ్యక్తం చేశారు. మండలంతో పాటు మరో 8మండలాలకు వేలాది మంది విద్యార్థులకు సమయానికి భోజనం అందించే వ్యవస్థను ప్రశంసించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈబృందంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ మౌనిక, ఎండీ రహిమతుల్లా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోనికుమారి, సీఆర్‌పీ జానార్దన్ ఉన్నారు.

కోళ్ల వాహనాలు వెనక్కి

- పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పశుసంవర్ధకశాఖ తనిఖీలు
- కర్నూలులో పెరుగుతున్న బర్డ్‌ఫ్లూ కేసులు
- ఏపీ నుంచి కోళ్లు, కోడిగుడ్లతో వచ్చే వాహనాలను తిప్పి పంపుతున్న అధికారులు



పుల్లూరు టోల్‌ప్లాజావద్ద వాహన తనిఖీలు చేస్తున్న సీఐ రవిబాబు, పశుసంవర్ధక శాఖాధికారులు

అలంపూర్: పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కోళ్లు, కోడిగుడ్ల వాహనాల తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఆ శాఖ అధికారులు, పోలీసులు తనిఖీలు చేసి తమిళనాడు నుంచి జడ్చర్లకు 12 వేల కోడిపిల్లలతో వస్తున్న వాహనాన్ని తిరిగి వెనక్కి పంపించారు. అలాగే కర్నూలు నుంచి చెన్నిపాడుకు వస్తున్న 2,700 కోడిగుడ్ల వాహనాన్ని, తమిళనాడులోని కృష్ణగిరి నుంచి నారాయణపురానికి వెళ్తున్న 887 కోళ్ల వాహనాన్ని, తాండ్రపాడు నుంచి పెబ్బేరుకు తరలిస్తున్న 140 కోళ్లను, బెంగుళూరు నుంచి పెబ్బేరుకు తరలిస్తున్న 200 బాక్స్‌ల గుడ్లు ఉన్న వాహనాలను తిరిగి వెనక్కి పంపించారు. సాయంత్రం సీఐ రవిబాబు, ఎస్‌ఐ మహేశ్ పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. కర్నూలు నుంచి షాద్‌నగర్‌కు వెళ్తున్న లారీలో 1.20 లక్షలు కోడిగుడ్లను గుర్తించారు. ఆ వాహనాన్ని వెనక్కి పంపినట్లు అధికారులు తెలిపారు. కర్నూలులో బర్డ్‌ఫ్లూ కేసులు అధికం కావడంతో అక్కడి అధికారులు రెడ్‌జోన్‌గా ప్రకటించారు.

బాధితులకు అండగా ఉంటా : మక్తల్ ఎమ్మెల్యే



పోలీస్‌స్టేషన్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: గుంటూరుకు చెందిన సుభాన్ మూడేళ్ల కిందట మక్తల్‌లో అమాయక ప్రజలను మోసం చేసి సుమారు రూ.150 కోట్లతో పరారయ్యారు. అతడే మూడురోజుల క్రితం నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోనూ ప్రజలను మోసం చేసి రూ.180 కోట్లు స్వాహా చేసి తప్పించుకున్నట్లు అక్కడి ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు రావడంలో ఇక్కడి బాధితులు శుక్రవారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. జనం ఎక్కువగా కనిపించడంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని.. డబ్బు ఇప్పించే ప్రయత్నం చేస్తానని భరోసా ఇవ్వడంతో వెనుదిరిగారు. సీఐ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల వెంకటేష్, చెన్నయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మరికల్: మండలంలోని తీలేరులో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 42 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు వివిధ గ్రామాల్లో తిరుగుతూ కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఇళ్లలో నిల్వ చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు పోలీసుల సాయంతో దాడులు నిర్వహించి ఐదుగురి ఇళ్లలో ఉన్న 42 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ధన్వాడ డీటీ భాస్కర్ తెలిపారు. బియ్యాన్ని ట్రాక్టర్‌లో పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

గిరిజనుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కొప్పుల రాజు

కొల్లాపూర్: గిరిజనుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో మూడు రోజులపాటు ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా ఆదివాసీ గిరిజన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజు, వంశీచంద్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఆదివాసీ జాతీయ చైర్మన్ విక్రం బురియా, ట్రికా చైర్మన్ బెల్లయ్యానాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరై ప్రసంగించారు. ఆదివాసీ గిరిజనులు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని వారు కాంక్షించారు. గిరిజనుల హక్కులను వివరించారు. శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న అంశాలను సమగ్రాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక గిరిజన నాయకులు హన్మంతునాయక్, బస్తీరాం నాయక్, శంకర్ నాయక్, రాంలాల్ పాల్గొన్నారు.

పరిహారం పెంచాకే పనులు చేపట్టాలి



ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

- ఉదండాపూర్ రిజర్వాయర్‌కట్టపై నిర్వాసితుల రిలే దీక్షలు
- పనుల అడ్డగింత

జడ్చర్ల: ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని రూ.25లక్షలకు పెంచి తమకు అందజేసిన తరువాతనే రిజర్వాయర్ పనులు చేపట్టాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఉదండాపూర్, కిష్టారం గ్రామాల సమీపంలో రిజర్వాయర్‌కట్టపై రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. అంతకు ముందు రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు కొనసాగిస్తున్న యంత్రాల దగ్గరకు వెళ్లి పనులను నిలిపివేయించారు. టిప్పర్లను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అప్పుడే అందించినట్లయితే ఎంతో కొంత లాభం ఉండేదన్నారు. ఏళ్లు గడిచినా తమ చేతికి పరిహారం అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా భూపరిహారాన్ని కూడా అదనంగా చెల్లించాలని కోరారు. త్వరితగతిన తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పనులను ముందుకు సాగనీయమని హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటనస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు బాలవర్ధన్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, శంకరయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్ శేఖర్, నాయకులు శ్రీరాములు, జంగయ్య, రామక్రిష్ణ, హన్మంతు ,శ్రీను, మాసయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాయకుల ఒత్తిడా? అధికారుల నిర్లక్ష్యమా?

- ఇసుక ఖాళీకావడంపై మండలవాసుల అనుమానాలు

రాజోళి: తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలించి నిల్వచేసిన ఇసుకను మైనింగ్ అధికారులు తరలించడంపై మండలంలో తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన 60 డంపులను గురువారం రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. అందులో నుంచి రాత్రికి రాత్రే సగం ఇసుక మాయమైంది. ఆరా తీస్తే మైనింగ్ అధికారులే తూర్పుగార్లపాడులో ఉన్న అనుమతుల పేరుతో డంపుల్లోని సగం ఖాళీ చేయించారని సమాచారం. ఎవరైనా అడిగితే మన ఇసుక వాహనం ట్రాక్టర్ల ద్వారా తరలించామని చెప్పుకొంటున్నారు. ఇసుక బుక్ చేసుకున్న వారికి తూర్పుగార్లపాడు నుంచి ఒక ధర.. రాజోళి నుంచి మరో ధర ఉంటుంది. గురువారం రాత్రి తరలించిన ఇసుక నిజంగా లబ్ధిదారులకు వెళ్లిందా లేక పక్కదారి పట్టిందా అనేది ప్రశ్నగా మిగిలింది. అధికారుల నిర్లక్ష్యమా? లేక ఎవరైనా నాయకుల ఒత్తిడి నుంచి జరిగిందా అనే అనుమానాలు మండలవాసులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ పి.రామ్మోహన్ మాట్లాడుతూ.. ఇసుక డంపులు గుర్తించామని, మైనింగ్ అధికారులు వాటిని తరలించారని తెలిపారు. మైనింగ్‌శాఖ ఏడీ వెంకటరమణను అడగగా.. సీజ్ చేసిన ఇసుకను అక్రమార్కులు పక్కదారి పట్టిస్తారని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి తరలించామని.. ఎవరి ప్రమేయం లేదని వివరించారు. ఏమైనా డంపులు ఉంటే అవికూడా పక్కదారి పట్టకుండా చూస్తామని తెలిపారు.